## క్లుప్తంగా

### జాతీయ లోక్ అదాలత్‌లో 153 కేసుల పరిష్కారం



భీమవరంలో జాతీయ లోక్ అదాలత్‌లో జడ్జి సోమశేఖర్

భీమవరం: భీమవరంలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 153 కేసులు రాజీ చేసినట్లు పోక్సో కోర్టు స్పెషల్ జడ్జి ఎంఏ సోమశేఖర్ చెప్పారు. జాతీయ లోక్ అదాలత్‌లో కక్షిదారుల సౌకర్యం కోసం 4 బెంచ్‌లు ఏర్పాటు చేసి 14 సివిల్ కేసులు, 4 మోటార్ యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ కేసులు, 110 క్రిమినల్ కేసులు, 25 బ్యాంక్, బీఎస్ఎన్ఎల్ ప్రీ లిటిగేషన్ కేసులు రాజీ చేయగా వాటి విలువ విలువ సుమారు రూ.1.80 కోట్లు ఉంటుందని వివరించారు. ఆకివీడుకు సంబంధించిన ప్రిన్సిపల్ సివిల్ జడ్జి కోర్టుకు చెందిన చీటింగ్ కేసు రాజీ చేసి ముద్దాయి నుంచి ఫిర్యాదుదారునికి రూ. 1.56 లక్షలు పరిహారం ఇప్పించారు. ఈ కార్యక్రమంలో సివిల్ జడ్జి బి అప్పలస్వామి, ప్రిన్సిపల్ సివిల్ జడ్జి జి సురేష్ బాబు, 2వ అదనపు జ్యుడీషియల్ మొదటి తరగతి మేజిస్ట్రేట్ డి ధనరాజు, సీహెచ్ జాన్సీ లక్ష్మి, న్యాయవాదులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ కాలేజీలో విద్యార్థుల సంఖ్య పెరగాలి



యండగండిలో ప్రభుత్వ జూనియర్ కాలేజీని సందర్శించిన కలెక్టర్ చదలవాడ నాగ రాణి

ఉండి: ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగి, ప్రమాణాలు పెంచే విధంగా అధ్యాపకులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగ రాణి సూచించారు. మండలంలోని యండగండి గ్రామంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీని ఆకస్మికంగా శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ బాగా చదువుకుని మంచి భవిష్యత్‌ను పొందాలన్నారు. కళాశాలలో విద్యా బోధన, వసతులపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రిన్సిపాల్ రామ ప్రియతో కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎంపీసీ, సీఈసీ, హెచ్ఈసీ గ్రూపులున్నాయని 105 మంది విద్యార్థులు చదువుతున్నట్లు ప్రిన్సిపాల్ చెప్పారు.

### పోషకాహారం తీసుకోవాలి

భీమవరం: తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యవంతంగా ఉండవచ్చునని అర్బన్ పీహెచ్‌సీ వైద్యుడు ఎస్‌వీఎల్ఎన్ ప్రసాద్ అన్నారు. భీమవరం పట్టణం 7వ వార్డులోని బీవీ రాజు మునిసిపల్ స్కూల్ ఆవరణలోని అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం నిర్వహించిన పౌష్టికాహార మహోత్సవాల్లో ఆయన మాట్లాడారు. సీడీపీఓ టీకేవీ లక్ష్మీకాంతం, సూపర్‌వైజర్ కె సరళ, అంగన్‌వాడీ కార్యకర్త ఎ దుర్గాదేవి పాల్గొన్నారు.

### వైభవంగా నిమజ్జనోత్సవం

కాళ్ల: గణపతి నవరాత్రి వేడుకల్లో భాగంగా శనివారం పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన గణనాథుని విగ్రహాలను నిమజ్జనం చేశారు. భారీ భారీ ఊరేగింపుల నడుమ, బాణసంచా కాల్పులతో యువకులు డ్యాన్సులతో గణనాథు విగ్రహాలను నిమజ్జనం చేశారు. పలు గ్రామాల్లో ఘనంగా నిమజ్జనం కార్యక్రమాలు నిర్వహించారు.

### ఘనంగా 'మన్యం ధీరుడు' ప్రీ రిలీజ్ ఈవెంట్



భీమవరంలో మన్యంధీరుడు ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో పాల్గొన్న చిత్ర యూనిట్ బృందం

భీమవరం: ఆర్‌వీవీ సత్యనారాయణ హీరో, నిర్మాతగా, డెక్కల నరేష్ దర్శకత్వంలో నిర్మించిన మన్యం ధీరుడు చిత్రం ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను శనివారం భీమవరం హౌసింగ్ బోర్డు కాలనీలో ఘనంగా నిర్వహించారు. ఈ చిత్రం ఘన విజయం సాధించాలని స్థానిక ఎమ్మెల్యే పి.రామాంజనేయులు ఆకాంక్షించారు. హీరో, నిర్మాత సత్యనారాయణ మాట్లాడుతూ ఈ చిత్రాన్ని ఈనెల 20న విడుదల చేస్తున్నామన్నారు. దర్శకుడు నరేష్, వేంద్ర వెంకటస్వామి, కోళ్ల నాగేశ్వరరావు, కంతేటి వెంకటరాజు, పాత్తూరి బాపిరాజు పాల్గొన్నారు.

### ఘనంగా హిందీ దివస్

భీమవరం: ప్రపంచ దేశాల్లో హిందీ భాషనే ప్రముఖంగా ఉందని హిందీ టీచర్ తూపురాణి గోదాదేవి అన్నారు. భీమవరం ఛాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో శనివారం హిందీ భాష దినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రైవేట్ హైస్కూళ్లలోని 20 మంది హిందీ ఉపాధ్యాయులను సత్కరించారు. భారతీయ విద్యాభవన్స్ టీచర్స్ యామిజాల మహాలక్ష్మి, టి.మోహిని, చెరుకువాడ రంగసాయి, నందమూరి రాజేష్, చిర్రరావూరి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

# కొల్లేరు వరద తగ్గుముఖం

- ముంపు బారిన వడ్డి గూడెం
- గ్రామాల్లో, చేలల్లో కదలని నీరు

ఆకివీడు: కొల్లేరు వరద క్రమేపీ తగ్గుముఖం పట్టింది. ముంపు నీరు వేగంగా ఉప్పుటేరు ద్వారా సముద్రంలోకి చొచ్చుకుపోతుంది. అయితే గ్రామాల్లోనూ, పంట చేలల్లో ఉన్న నీటిమట్టం స్తబ్దతగా ఉంది. ఉప్పుటేరు ఉధృతంగా ప్రవహించడంతో చేలల్లోని నీరు బయటకుపోయేందుకు మరి కొన్ని రోజులు పడుతుందంటున్నారు. కొల్లేరు తీరంలోని చినమిల్లిపాడు, దుంపగడప, చినకాపవరం, రాజులపేట, సిద్ధాపురం, రాజులకొట్టడ, ధర్మాపురం, కురుపాక, మందపాడు తదితర గ్రామాల్లోని శివారు ప్రాంతాలు జలమయ్యమయ్యాయి. చినమిల్లిపాడు శివారు వడ్డిగూడెంలో సుమారు 50 మంది బాధిత కుటుంబాలకు నిత్యవసరాలు అందక ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయాన్ని సర్పంచ్,ఉపసర్పంచ్ గురుదాసు సీత, బాలాజీలు లయన్స్‌క్లబ్‌కు తెలియజేయడంతో సహాయం అందజేశారు. దుంపగడపలోని ఉప్పుటేరు ఏటిగట్టున ఉన్న ప్రాంతాల్లో నివాసం ఉంటున్న వారు ఇళ్ల ముందుకు ముంపు నీరు వచ్చినిలబడింది. ఉప్పుటేరు గట్లను తాకి ప్రవహిస్తుంది. సమీప గ్రామాల్లో ముంపు నీరు కదలకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.



వడ్డిగూడెంలో ముంపు నీటికి అడ్డుకట్ట వేసుకుంటున్న దృశ్యం



బాధితులను పరామర్శిస్తున్న ఉప సర్పంచ్ గురుదాసు



దుంపగడపలో చెరువును తలపిస్తున్న పంట పొలాలు

## ఆక్రమణదారులకు నోటీసులు జారీ

ఆకివీడు: పంట కాలువ, రోడ్డు ఆక్రమణల్లో ఉన్న ఇళ్లను తొలగించేందుకు శనివారం రెవెన్యూ, పంచాయతీ అధికారులు నోటీసులు జారీ చేశారు. కుప్పనపూడి పంచాయతీ పరిధిలోని 141 మంది స్థానిక అయిభీమవరం రోడ్డులో పంట, రోడ్డు పోరంబోకులను ఆక్రమించుకుని గత 40 ఏళ్లుగా నివశిస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే ఆదేశాల మేరకు ఆక్రమణల తొలగింపులో భాగంగా వారికి నోటీసులు జారీ చేస్తుండగా చాలా మంది బాధితులు నోటీసులు తీసుకోలేదు. దీంతో వారి ఇళ్ల గోడలకు అంటించి వెళ్లిపోయారు. రెండు, మూడు తరాలుగా ఈ ప్రాంతంలో జీవిస్తున్నామని, మాకు ఇంటి పన్ను, విద్యుత్, ట్యాప్ కనెక్షన్లు ఇచ్చారని, తమను అర్థాంతరంగా ఖాళీ చేయించడం తగదని బాధితులు వాపోతున్నారు. తమకు ఇళ్ల స్థలాలు, పట్టాలు ఇచ్చారని, అయితే అవి చెరువును తలపిస్తున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. స్థలం పూడ్చకుండా, ఇళ్లు నిర్మించుకునేందుకు సహాయం అందజేయకుండా తమను బలవంతంగా ఖాళీ చేయించడం దారుణమని వారు వాపోయారు. పలువురు నోటీసులు తీసుకోగా, మరి కొంత మంది నిరాకరించడంతో వాళ్ల ఇళ్లకు అంటించినట్లు కార్యదర్శి ఆనంద భూషన్, వీఆర్ఓ దానయ్య చెప్పారు.



అయిభీమవరం రోడ్డు వెంబడి ఉన్న ఆక్రమణలపై నోటీసులు జారీ చేస్తున్న అధికారులు

## పశువుల దాణా అందజేత

ఆకివీడు: ముంపు ప్రాంతాల్లో నోరు లేని జీవాలకు ఆహారం అందించడం మన కర్తవ్యమని పశుసంవర్థక శాఖ ఉప సంచాలకులు జవహర్ హుస్సేన్ చెప్పారు. మండలంలోని సిద్ధాపురం, కోళ్లపర్రు, చినమిల్లిపాడు, కాళింగగూడెం, సమతానగర్ ప్రాంతాల్లో 25 టన్నుల పశువుల దాణాను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వరద ముంపునకు పచ్చగడ్డి, ఎండుగడ్డి పూర్తిగా పాడైపోయి, కుళ్లిపోయిందన్నారు. మనుషులతో పాటు పశువులు కూడా ఆహారం అందక అలమటిస్తున్నాయని జిల్లా కలెక్టర్ నాగ రాణి గుర్తించి కొల్లేరు తీర గ్రామాల్లోని పశువులకు దాణా సరఫరా చేశారని చెప్పారు. దాణా పాడిరైతులందరికీ అందే విధంగా చర్యలు తీసుకున్నామన్నారు. కార్యక్రమంలో ఏడీఏ జనార్ధనరావు, మండల పశుసంవర్ధక అధికారిణి భార్గవీ సత్య, మౌర్య, హను, యోహాన్, సర్పంచ్ చిగురుపాటి చిట్టిబాబు, భూపతిరాజు బుజ్జిరాజు, కన్నయ్యరాజు, అంజిరాజు, తిమ్మరాజు, బొల్లా వెంకట్రావు పాల్గొన్నారు.



పశువుల దాణా పంపిణీ చేస్తున్న డీడీ జవహర్ హుస్సేన్, ఏడీ జనార్దనరావు

## మోక్షగుండం సేవలు ఆదర్శనీయం

భీమవరం: భీమవరం డీఎన్నార్ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం ఇంజనీర్స్ డే పురస్కరించుకుని వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్ర పటానికి కళాశాల అధ్యక్షుడు గోకరాజు వెంకటనర్సింహరాజు కార్యదర్శి గాదిరాజు సత్యనారాయణరాజు (బాబు) పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం నర్సింహరాజు మాట్లాడుతూ మోక్షగుండం గొప్ప ఇండియన్ సివిల్ ఇంజనీర్‌గా సేవలందించారని భావితరాలకు ఆయన ఆదర్శనీయుడన్నారు. సెక్రటరీ గాదిరాజు బాబు మాట్లాడుతూ ఆధునిక భారతదేశంలో ఆనకట్టలు, రిజర్వాయర్లు, హైడ్రో-ఎలక్ట్రిక్ ప్రాజెక్టుల నిర్మాణంలో కీలక పాత్ర పోషించిన గొప్ప ఇంజనీర్ విశ్వేశ్వరయ్య అన్నారు. విశ్వేశ్వరయ్యకు నివాళిగా ఏటా సెప్టెంబర్ 15న ఇంజనీర్స్ డేగా జరుపుకుంటున్నామన్నారు. అనంతరం విద్యుత్‌శాఖ ఈఈ ఫీర్ అహ్మద్‌ఖాన్‌ను సత్కరించారు. విద్యార్థులకు నిర్వహించిన చిత్రలేఖన పోటీలో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఎం అంజన్‌కుమార్, మెకానికల్ హెచ్ఓడీ హరీష్ పాల్గొన్నారు.



భీమవరం డీఎన్నార్ కళాశాలలో ఫీర్ అహ్మద్‌ఖాన్‌ను సత్కరిస్తున్న దృశ్యం

## పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

భీమవరం అర్బన్: పోషకాహారం తీసుకోవడంతోనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చని భీమవరం ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో టీకేవీ లక్ష్మీకాంతం అన్నారు. భీమవరం మండలంలోని యనమదుర్రులో అంగన్‌వాడీ సెంటర్‌లో పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా శనివారం గర్భిణులు, బాలింతలు, కిషోర బాలికలకు పోషకాహారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీడీపీవో టీకేవీ లక్ష్మీకాంతం మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో ఆకు కూరలు, కాయగూరలు, జామ, బొప్పాయి, అరటి పండు తదితర వాటిని ఆహారంలో తీసుకుంటే అధిక పోషకాలు పొందవచ్చన్నారు. పోషకాహారం తీసుకుంటే వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. రక్తహీనత రాకుండా రక్త పరీక్షలు చేయించుకుని ఐరన్ ట్యాబ్లెట్లు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ అనిల్ కుమార్, డీవీవీ కనకదుర్గ, జి. సరస్వతి, సీహెచ్ ప్రసన్న కుమారి పాల్గొన్నారు.

**ఐసీడీఎస్ ఆధ్వర్యంలో**



యనమదుర్రులో అంగన్‌వాడీ సెంటర్‌లో పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**పౌష్టికాహార మాసోత్సవాలుఫోటో**

కాళ్ల: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహిస్తున్నామని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.సూర్యకుమారి తెలిపారు. బొండాడ పేటలో ఐసీడీఎస్ ఆకివీడు ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో శనివారం పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించి గర్భిణులు, బాలింతలకు వివిధ విషయాలపై అవగాహన కల్పించారు. ఈ నెల 30 వరకు ఈ మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## వరద బాధితుల సహాయార్థం రొట్టెలు, దుప్పట్ల పంపిణీ

భీమవరం: భీమవరంలోని అల్లూరి సీతారామరాజు భగత్‌సింగ్ సేవా విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో విజయవాడ వరద బాధితులకు సహాయార్థం దాతల నుంచి సేకరించిన దుస్తులు, దుప్పట్లు, బ్రెడ్లు, వాటర్ బాటిళ్లు వంటి వాటిని బాధితులకు పంపిణీ చేయడానికి శనివారం ప్రత్యేక వాహనంలో తీసుకువెళుతున్నట్లు కేంద్రం చైర్మన్ బి బలరామ్ చెప్పారు. హైదరాబాద్ అభయం ఫౌండేషన్, కుముదవల్లికి చెందిన భూపతిరాజు సురేష్‌వర్మ దుప్పట్లు, పెన్నాడ సర్పంచ్ గొట్టుముక్కల శివాజీరాజు వాటర్ బాటిళ్లు, పిప్పరకు చెందిన దాతలు దుస్తులు సహాయంగా ఇచ్చారని బలరామ్ వివరించారు.

**వరద బాధితులకు సాయం**

కాళ్ల: మండలంలోని ప్రాతళ్లమెరక సీబీసీఎన్‌సీ బాప్టిస్ట్ సంఘ సభ్యులు విజయవాడ వరద బాధితులకు అండగా నిలిచారు. సంఘ సభ్యుల సహకారంతో స్థానిక యువకులు రెండు వ్యాన్లను ఏర్పాటు చేసుకొని నిత్యవసరాలు, ఆహారాన్ని స్వయంగా శనివారం బాధితులకు అందించారు. రాజరాజేశ్వరి కాలనీలో సుమారు 200 మందికి నిత్యవసరాలు అందించారు. అలాగే స్థానికంగా ఉన్న వద్ధాశ్రమంలో వద్ధులకు భోజనం అందించారు.

**వరద బాధితులకు రూ.15.75 లక్షల విరాళాలు**

భీమవరం: వరద బాధితులకు దాతలందిస్తున్న సహకారం వెలకట్టలేనిదని భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. శనివారం క్యాంపు కార్యాలయంలో వరద బాధితుల సహాయార్థం పలువురు దాతలు రూ 15.75 లక్షలు అందించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. విరాళాలిచ్చిన వారిలో భీమవరం ప్యాడీ అండ్ రైస్ మర్చంట్స్ అసోసియేషన్ రూ.15 లక్షలు, ఫెర్టిలైజర్స్ అండ్ డీలర్స్ అసోసియేషన్ రూ.25 వేలు, రైస్ అండ్ ఆయిల్ మర్చెంట్స్ అసోసియేషన్ రూ.25 వేలు, ఇందుకూరి కృష్ణంరాజు రూ.25 వేలు ఎమ్మెల్యే అంజిబాబుకు అందించారు.ఈ కార్యక్రమంలో పాత్తూరి బాపిరాజు, కోళ్ల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

### రైతుల పంట రుణాలు రీ షెడ్యూల్ చేయాలి

భీమవరం: రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలు, వరదల కారణంగా నష్టపోయిన రైతుల పంట రుణాలు ప్రభుత్వం రెండేళ్లపాటు రీషెడ్యూల్ చేయాలని ఏపీ రైతు కార్యాచరణ సమితి కన్వీనర్ కమలాకరశర్మ అన్నారు. శనివారం భీమవరంలో సమితి అధ్యక్షుడు పాతపాటి మురళీరామరాజు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సార్వా సీజన్ ప్రారంభంలో భారీ వర్షాల కారణంగా వరి నారుమళ్లు, ముందుగా వేసిన నాట్లు పూర్తిగా దెబ్బతినగా ఆగస్టులో వర్షాలు, వరదలు కారణంగా వేలాది ఎకరాల్లో వరిపైరు నీట మునిగి రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. ఇటువంటి తరుణంలో రైతులను ఆదుకోడానికి ప్రభుత్వం రుణాలు రీషెడ్యూల్‌తోపాటు వడ్డీ రాయితీ కల్పించాలన్నారు. ఈ సమావేశంలో సమితి గౌరవాధ్యక్షుడు కలిదిండి గోపాలకృష్ణంరాజు, కార్యదర్శి ఎం కృష్ణంరాజు, ఉపాధ్యక్షుడు దాట్ల లక్ష్మీపతిరాజు, ముదుండి సత్యనారాయణరాజు పాల్గొన్నారు.

### కౌలురైతులకు పరిహారం అందించాలి

భీమవరం: జిల్లా వ్యాప్తంగా కురిసిన అధిక వర్షాలకు పంటలు దెబ్బతిన్న కౌలు రైతులకు పంటనష్ట పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు శనివారం డిమాండ్ చేశారు. జిల్లాలోని 16 మండలాల్లో 8 వేల ఎకరాల్లో 6,500 మంది రైతులు పంట కోల్పోయారన్నారు. ప్రధానంగా కాళ్ల, ఆకివీడు, ఉండి, భీమవరం, నరసాపురం, యలమంచిలి, పాలకొల్లు, పోడూరు, ఆచంట మండలాల్లో వరి పంట అధికంగా దెబ్బతిందన్నారు. సార్వా సీజన్ ప్రారంభం నుంచి అధిక వర్షాలు కారణంగా పలుమార్లు నారుమళ్లు, నాట్లు వేసి ఎకరాకు రూ. 25 వేలు నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై తక్షణమే కలెక్టర్, ఉన్నతాధికారులు స్పందించి కౌలురైతులకు పంట నష్టం, పంటల బీమా అందించడంతోపాటు వడ్డీ లేని పంట రుణాలు ఇవ్వాలని రామాంజనేయులు కోరారు.

### పెన్షనర్లకు 12వ పీఆర్సీ అమలులో జాప్యం

భీమవరం: పెన్షనర్స్‌కు 12వ పీఆర్సీ అమలులో జాప్యం జరుగుతున్నందున ప్రభుత్వం తక్షణం ఐఆర్ ఇవ్వాలని ఏపీ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బి హరికుమార్ డిమాండ్ చేశారు. శనివారం భీమవరంలో నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటి వరకు పెన్షనర్లకు ఇవ్వాల్సిన డీఆర్ బకాయిలు చెల్లించాలని, 11వ పీఆర్సీ బకాయిలు చెల్లించాలని ఆయన కోరారు. అసోసియేషన్ భీమవరం శాఖ అధ్యక్షుడు అప్పారావు, చిన్నయ్య, బ్రహ్మనందం, ఉపాధ్యాయులు పి.కనకలక్ష్మి, రవికుమార్ పాల్గొన్నారు.

### ఓజోన్ పరిరక్షణ అందరి బాధ్యత

వీరవాసరం: స్థానిక జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఓజోన్ భద్రతా దినోత్సవంలో భాగంగా పాఠశాల విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రీన్ కోర్ అవార్డు గ్రహీత పంపన సాయిబాబు మాట్లాడుతూ ప్రపంచ మానవాళికి రక్షణ కవచంలా ఉన్న ఓజోన్ పొరను కాపాడుకోవలసిన బాధ్యత అందరిపై ఉందని అన్నారు. ఓజోన్ పొర భద్రత -నివారణ చర్యలు అంశంపై వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. డాక్టర్ చిలుకూరి ఫణికుమార్, సుబ్రహ్మణ్యం, రామలక్ష్మి, పార్వతి, వై వెంకటేశ్వరరావు, ఏలూరి శ్రీనివాస్, పద్మజరాణి, భాను కుమారి, రత్న రాజు, చిన్న బాబు, పెద్దిరాజు, రాజబాబు, పీడీ మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

### అన్నదానానికి ట్రాలీల అందజేత

ఉండి: సఖినేటిపల్లి మండలం అతర్వేది లక్ష్మీనర్సింహస్వామి ఆలయానికి రూ.50 వేల విలువైన స్టీల్ ట్రాలీలను అందించినట్లు నల్లా విజయలక్ష్మీ ఛారిటబుల్ ట్రస్ట్ అధినేత సత్యకృష్ణకిరణ్ ప్రసాద్, మాధవి శనివారం విలేకరులకు తెలిపారు. అంతర్వేది లక్ష్మీ నర్సింహస్వామి ఆలయంలో నిత్యాన్నదానం జరుగుతున్న దృష్ట్యా వడ్డింపునకు సులభంగాను ఉండేందుకు రెండు స్టీల్ ట్రాలీలు ఇచ్చినట్లు తెలిపారు. రాజా కలిదిండి కుమార రామ గోపాల రాజా బహద్దూర్, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణకు ట్రాలీలను అందించినట్లు సత్యకిరణ్ తెలిపారు. అనంతరం స్వామి వారిని దర్శించుకుని వివరించారు.

### సాయం అందజేత

ఆకివీడు: ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడంలో లయన్స్ ముందంజలో ఉంటుందని లయన్స్ జిల్లా మాజీ గవర్నర్ డాక్టర్ ఎంవీ.సూర్యనారాయణరాజు చెప్పారు. చినమిల్లిపాడు శివారు వడ్డిగూడెం ముంపు బాధితులకు శనివారం నిత్యవసర వస్తువులు పంపిణీ చేశారు. రీజియన్ చైర్మన్ గొంట్లా కృష్ణమూర్తి, క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కాకర్ల రాజరాజేశ్వరి, మోరా జ్యోతిరెడ్డి, కోశాధికారి ఎం.నాగమణి, నేరెళ్ల రామ చెంచయ్య, పాల్గొన్నారు.

**ప్రకటన**

నా క్లయింట్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ భీమవరం వారు నాకిచ్చిన సమాచారం ప్రకారం శ్రీ గుడాల శేఖ దుర్గ ప్రశాంత్ తండ్రి సత్యప్రసాద్ మార్టుగేజ్ చేయడానికి అంగీకరించారు. సదరు ఆస్తిపై ఏ విధమైన అభ్యంతరములు ఉన్నా ఈ ప్రకటన వెలువడిన వారం రోజుల లోపల మాకు తెలియజేయవలెను. తరువాత వచ్చిన అభ్యంతరములు స్వీకరించబడవు. గునుపూడి సబ్ రిజిస్ట్రార్ డాక్యుమెంట్ నం. 6190/2016,ప్లాట్ నం.40 ఆర్.యస్.నం 158 లో 466 చ.గ భీమవరం పట్టణం, గునుపూడికి చెందిన స్థలానికి హద్దులు తూర్పు : ఎల్లాతీరావుకు చెందిన ప్లాట్ నెం.49, స్థలం పడమర : రోడ్డు ఉత్తరం : ప్లాట్ నం.41 స్థలం దక్షిణం : ప్లాట్ నం.39

పి.డి.యస్.వి.బాలాజీ, బి.కాం,బి.ఎల్.
అడ్వకేటు,పాలకొల్లు,సెల్ : 9490433732



### నిందితుడి అరెస్ట్

భీమవరం: భీమవరం టూటౌన్ పరిధిలో మహిళను అత్యాచారం చేసిన నిందితుడ్ని అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈనెల 11న సంఘటన జరగ్గా బాధితురాలు 12న ఫిర్యాదు చేసిందన్నారు. నిందితుడైన సీహెచ్ మధుకుమార్‌ను పట్టణంలోని 18వ వార్డులోని అతని ఇంటి వద్ద శనివారం ఉదయం డీఎస్పీ ఆర్.జి. జయసూర్య ఆధ్వర్యంలో అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపర్చారు.

### ఏచూరి మృతి కమ్యూనిస్టులకు తీరని లోటు

భీమవరం అర్బన్: సీతారాం ఏచూరి లేకపోవడం కమ్యూనిస్టులకు తీరని లోటని సీపీఎం పార్టీ మండల కన్వీనర్ ఇంజేటి శ్రీనివాస్ అన్నారు. భీమవరం మండలంలోని వెంపలో ఎస్సీ పేటలో శనివారం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి సంతాపం వ్యక్తం చేశారు.

**సీతారాం ఏచూరికి ఘన నివాళి**

ఆకివీడు: స్థానిక వైఎస్సార్ సెంటర్‌లో శనివారం సీతారాం ఏచూరి సంతాప సభ సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించారు. సభలో సీపీఎం జిల్లా కార్యవర్గ కార్యదర్శి జెఎన్వీ. గోపాలన్, వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షులు బొబ్బిలి బంగారయ్య పాల్గొని ఘన నివాళులు అర్పించారు.

### డీజిల్ చోరీపై కేసు

ఉండి: ఆక్వా చెరువుపై డీజిల్ చోరీకి గురి కావడంతో ఓ రైతు పోలీసులను ఆశ్రయించాడు. వారు తెలిపిన వివరాల ప్రకారం ఉండి గ్రామానికి చెందిన పూసపాటి వెంకట్రాజు అనే ఆక్వారైతు మహదేవపట్నం గ్రామంలో ఆక్వాసాగు చేస్తున్నాడు. ఈ నెల 9 రాత్రి చెరువుపై ఉండే జనరేటర్ కోసం రూ.50 వేల విలువైన 500 లీటర్ల డీజిల్‌ను 250 లీటర్ల చొప్పున తెచ్చి చెరువు వద్ద ఉన్న షెడ్‌లో పెట్టి తాళం వేశారు. 10వ తేదీ ఉదయం వెళ్లిచూడగా తాళాలు పగులగొట్టి గుర్తు తెలియని వ్యక్తులు డీజిల్ దొంగిలించినట్లు రైతు గుర్తించాడు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

### రిటైర్డ్ పీహెచ్ఎన్ మృతి

ఉండి: వైద్య ఆరోగ్యశాఖ రిటైర్డ్ పీహెచ్ఎన్ కాకరాల దేవమణి అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. ఉండి, అర్తమూరు, కలిసిపూడి, పాందువ్వ గ్రామాల్లో ఏఎన్ఎం గానూ అనంతరం పదోన్నతిపై పీహెచ్ఎన్‌గా ఆమె పని చేశారు. ఆమె మృతిపై మావనత మండల కార్యదర్శి గాదిరాజు రంగరాజు, మండల కో చైర్మన్ దంగేటి రామలింగేశ్వరరావు దేవమణి తదితరులు సంతాపం తెలిపారు.